హైదరాబాద్ వార్త



# నిఘా విభాగానికి కొత్త 'రెక్కలు'

**- నిఘాకు ఏడు జోన్లు.. ఎనిమిది విభాగాలు - హైదరాదాబాద్ కమిషనరేట్ పరిధిలో కీలక మార్పులు**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిఘా విభాగానికి(ఎస్బీ) కొత్త రెక్కలు(వింగ్స్) వచ్చాయి. నిఘా విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఏడు జోన్లుగా విభజించడమే కాకుండా ఎనిమిది విభాగాలతో బలోపేతం చేశారు. గతంలో పోలీసు శాఖలోని అధికారుల, సిబ్బంది పనితీరుపై నిఘాతోపాటు పాస్‌పోర్టు నమోదు, తనిఖీ వ్యవహారాలను పరిశీలించే ఎస్బీ ఇప్పుడు మరింత లోతైన నిఘాకు సిద్దమైంది. కీలకమైన, సున్నితమైన అంశాలపై దృష్టి సారించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయడమే కాకుండా ఇప్పటికే ఆయా విభాగాలకు ఆయా బాధ్యతలను అప్పగించారు.

**ఎస్బీ పనితీరు ఇలా..**

స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) నగరంలో చాలా కాలంగా కీలకంగా వ్యవహరిస్తుంది. అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్బీ ఎస్సైతోపాటు సిబ్బంది అధికారుల పనితీరు, అవినీతి ఆరోపణలు, ఇతర అంశాలపై దృష్టి పెట్టేవారు. వీరిపై ఒక ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణ ఉండేది. వీరు సేకరించే సమాచారాన్ని నేరుగా కమిషనర్ దృష్టికి నివేదిక రూపంలో తీసుకెళ్లారు. ఎస్బీ నివేదికల ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులు సంబంధిత అధికారులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం, అవసరమైతే వారి చార్జిమెమోలు ఇవ్వడం చేసేవారు. మరోవైపు పాస్‌పోర్టుల తనిఖీ, అనుమతులు ఇచ్చేవారు. ప్రధానమైన నేతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేవారు. నగరంలో గతంలో దాదాపు 30 మంది ఇన్‌స్పెక్టర్లు, దాదాపు 45 మంది ఎస్సైలు ఎస్బీలో పనిచేసేవారు. దీనికితోడు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్బీకి సంబంధించిన కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించేవారు.

**ఏడు జోన్లుగా..**

ప్రస్తుతం ఉన్న ఎస్బీ విభాగాన్ని ఏడు జోన్లుగా విభజించారు. ఇందులో భాగంగా సౌత్ జోన్, సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, నార్త్ జోన్, ఈస్ట్ జోన్, సౌత్ ఈస్ట్ జోన్‌లుగా విభజించారు. ఇలా జోన్లుగా విభజించి ఆయా జోన్లకు అవసరమైన చోట ఇన్‌స్పెక్టర్లను లేదంటే ఎస్సైలను నియమించారు. వారికి దాదాపు పది నుంచి పదిహేను మంది సిబ్బందిని ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే కొన్ని జోన్లకు సంబంధించి నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ సమావేశాలు సైతం ఏర్పాటు చేశారు. అధికారుల, సిబ్బంది కేటాయింపులతో పాటు వారు చేపట్టాల్సిన బాధ్యతలను గుర్తుచేశారు.

**ఎనిమిది విభాగాలుగా..**

ఎస్బీని ఇప్పుడు ఎనిమిది విభాగాలుగా చేశారు. ఇందులో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్, జాబ్ వెరిఫికేషన్ కోసం ఒక విభాగాన్ని ఏర్పాటుచేశారు. రౌడీలు, ముఖ్యమైన నేరాలకు సంబంధించి పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఎస్ఓటీ తరహా విభాగాన్ని ఏర్పాటుచేశారు. వీటితోపాటు విదేశీయులను పర్యవేక్షించేందుకు, వైట్‌కాలర్ ఛీటర్స్‌ను గమనించేందుకు, అనాలసిస్ విభాగం, ఇల్లీగల్ అండ్ మిస్లేనియస్ సెల్, ఓఎస్, ఎస్ఒసీ విభాగాలను ఏర్పాటుచేశారు. వీటితోపాటు అడ్మిన్ విభాగం, హెచ్‌సీఎఫ్, ఎంసీఎఫ్, ఏపీపీ, ఎస్అండ్ఎల్, సీఎఫ్ఎస్ఎఫ్, ప్రెస్ సెక్షన్ పేరుతో ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం సంయుక్త కమిషనర్ యూనిట్ అధికారిగా వ్యవహరిస్తుండగా అతని కింద ఇద్దరు అదనపు డీసీపీలు, ఎనిమిది జోన్లకు ఎనిమిది మంది ఏసీపీలు, దాదాపు 25 మంది ఇన్‌స్పెక్టర్లు, 25 మంది ఎస్సైలు ఆయా విభాగాలకు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇక నుంచి ప్రతి అంశాన్ని సంబంధిత విభాగం కూలంకుశంగా పరిశీలించి సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో పంపనుంది.

# వేగంగా 'మున్సిపాలిటీల విలీన ప్రక్రియ'

**-రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న జిహెచ్ఎంసి అధికారులు**
**-మొదట వార్డులుగా విభజించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్**
**-వారంరోజులపాటు అభ్యంతరాల స్వీకరణ..ఆతర్వాత ఫైనల్ నోటిఫికేషన్**



జవరహర్‌నగర్ మున్సిపాలిటీ బోర్డును జిహెచ్ఎంసిగా మార్చిన అధికారులు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీన ప్రక్రియ వేగంగా సాగుతుంది. వాటి రికార్డులను స్వాధీనం చేసకునేందుకు సమీప సర్కిర్ డిప్యూటీ కమిషనర్లకు, జోనల్ జోనల్ కమిషనర్లకు బాధ్యతలు అప్పజెప్పడంతో బుధవారం అర్ధరాత్రి నుంచే అధికారులు ఆ ప్రక్రియను చేపట్టారు. శుక్రవారం సాయంత్రంలోపు మొత్తం రికార్డులు స్వాధీనం చేసుకోనున్నారు. ఆతర్వాత ఒకటిరెండురోజుల్లో విలీన స్థానిక సంస్థలను కలుపుకుని మొత్తం 300 పై చిలుకు మున్సిపల్ వార్డులుగా పునర్విభజించి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేసేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. విలీనమైన స్థానిక సంస్థలను ప్రస్తుతం సర్కిల్స్ గా పరిగణించిన జీహెచ్ఎంసీ వాటిలోని జనాభా, విస్తీర్ణాన్ని కూడా పరిగణలోకి తీసుకుని మున్సిపల్ వార్డులుగా పునర్విభజించి నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత డీలిమిటేషన్ డ్రాఫ్ట్ పై వారం రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాతే ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని జీహెచ్ఎంసీ భావిస్తుంది. ఈ మొత్తం ప్రక్రియను ఈ నెల 27వ తేదీలోపు ముగించాలని జీహెచ్ఎంసీ డెడ్ లైన్ కూడా పెట్టుకున్నట్లు సమాచారం. ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జనవరి మాసంలో జరగనున్న కౌన్సిల్ సమావేశంలో డీలిమిటేషన్ ఫైనల్ నోటిఫికేషన్ కు ఆమోదం తీసుకున్నానంతరం సర్కారుకు పంపాలని జీహెచ్ఎంసీ భావిస్తున్నట్లు తెలుస్తుంది.



నాగారం మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

**మొదటగా వార్డులుగా విభజన..**

ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోనున్న 150 వార్డులను సుమారు 250 వార్డులుగా పునర్విభజించిన తర్వాతే ప్రతిపాదిత 27 లోకల్ బాడిలను మరో 50 వార్డులుగా విభజించే ప్రక్రియ చేపట్టాలని సర్కారు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం 650 కిలోమీటర్ల విస్తీర్ణం కల్గిన జీహెచ్ఎంసీలోకి 20 మున్సిపాల్టీలను విలీనం చేస్తుండటంతో అందులోనున్న 407 వార్డులు, 714.18 కిలోమీటర్ల విస్తీర్ణంతో పాటు 10 లక్షల 49 వేల 357 మంది జనాభా జీహెచ్ఎంసీ పరిధిలోకి రానుంది. వీటితో పాటు మరో ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల విలీనంలో భాగంగా అదనంగా మరో 215 వార్డులు, ఏరియా 233.98 కిలోమీటర్లతో పాటు పది లక్షల 78 వేల 501 మంది జనాభా జీహెచ్ఎంసీ పరిధిలోకి రానున్నారు. 27 లోకల్ బాడిల విలీనం తర్వాత జీహెచ్ఎంసీ పరిధిలో 2011 జనాభా లెక్కలకు తోడు ప్రస్తుత అంచనా లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిని కలుపుకుని మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో సుమారు కోటి 30 లక్షల పై చిలుకున్నట్లు అధికారులు సీజీజీ ద్వారా సమాచారం సేకరించినట్లు తెల్సింది. విలీనం తర్వాత తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ విస్తీర్ణం సుమారు 1572.98 కిలోమీటర్లకు పెరగనుంది. ఈ మొత్తం విస్తీర్ణంలోని ప్రతి 40 వేల జనాభాకు ఒక వార్డును ఏర్పాటు చేసే దిశగా పునర్విభజన ప్రక్రియ కొనసాగుతుంది. ఒక వార్డును పునర్విభజించేందుకు గాను ఆ ప్రాంతంలోనే నాలాను, మెయిన్ రోడ్డును గానీ ల్యాండ్ మార్క్ గా తీసుకుని అక్కడి నుంచి 40 వేల జనాభా ఉన్న వరకు మార్కింగ్ చేసుకుని మున్సిపల్ వార్డుగా ఫిక్స్ చేస్తున్నట్లు సమాచారం.

**ఒకే సర్కిల్‌కు వచ్చేలా జాగ్రత్తలు..**

మున్సిపల్ వార్డుల పునర్విభజన విషయంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని చెప్పవచ్చు. వచ్చే సంవత్సరం జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను దృష్టి లో పెట్టుకుని, ఒక మున్సిపల్ వార్డు పరిధి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి రాకుండా జాగ్రత్త పడుతూ వార్డులను పునర్విభజించనున్నట్లు సమాచారం. దీనికి తోడు సర్కిళ్లను ఏర్పాటు చేసే సమయంలోనూ ఒక వార్డు రెండు పరిధి రెండు సర్కిళ్ల పరిధిలోకి రాకుండా పౌర సేవల నిర్వహణ, పరిపాలన సౌలభ్యం కోసం ఒకే సర్కిల్ లో ఉండేలా కూడా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే కారిడార్ పనులు ఆలస్యం : ఎమ్మెల్సీ కవిత



ఉప్పల్ ప్రధాన రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఎలివేటెడ్ కారిడార్ పనులు ఆలస్యం అవుతున్నాయని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పలువురు నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఉదయం రామంతాపూర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా మరణించిన మృతుల కుటుంబాను పరామర్శించారు. అనంతరం ఉప్పల్ ప్రధాన రహదారిలోని ఎలివేటెడ్ కారిడార్ పనులు పరిశీలించారు. కురుమనగర్‌లో నిర్మిస్తున్న ఎస్‌టిపి పనులను పరిశీలించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. చిలుకానగర్‌లో తెలంగాణ ఉద్యమకారిణి సుభద్ర ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఈసందర్బంగా జరిగిన సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పల్‌లో కారిడార్‌ను గత 8 ఏళ్లుగా కడుతూనే ఉన్నారని, ప్రభుత్వాలు మారుతున్నా పనులు పూర్తి కావడం లేదన్నారు. నిత్యం ప్రమాదాలతో ఉప్పల్ ప్రజల పరిస్థితి మారటం లేదన్నారు. దీనిపై తాను శాసన మండలిలో ప్రశ్నించానని, మంత్రి కోమటిరెడ్డి స్పందించి త్వరలోనే సమీక్ష చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాని ఆ తర్వాత కాంట్రాక్టర్ ను మార్చారో లేదో తెలియదు కానీ ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవటానికి ప్రజల వద్దకు వచ్చినట్లు తెలిపారు. నారపల్లి వరకు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ కారిడార్ నిర్మిస్తున్నారని, కాని గత 8 ఏళ్లుగా కడుతున్నారంటే ప్రజల పట్ల ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవటం కారణంగానే ఆలస్యమవుతున్నాయని ఆరోపించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు పూర్తి చేయించాలని సూచించారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ ఉప్పల్‌కు వచ్చి ప్రజల పరిస్థితి చూడాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఇక్కడకు వచ్చి నిరసన తెలిపి అధికారుల వెంటపడి పనులు చేయించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, లేకుంటే తాము ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఉప్పల్ కురుమనగర్ ఎస్‌టిపి వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మరో చోటకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ఉప్పల్ ఇంచార్జ్ గోపు సదానంద్, ఈగ సంతోష్, జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, బాలకృష్ణ, కృష్ణానాయక్, సంపత్ రావు, దోసల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల డిమాండ్లు అమలు చేయకపోతే ముట్టడి




సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి, లేని పక్షంలో ఈ నెల 9న రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి హెచ్చరించింది. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారం, హక్కుల సాధన కోసం ఆటో డ్రైవర్ల అన్ని సంఘాల నాయకులు గురువారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో సమావేశమైనారు. ఈ సందర్బంగా జెఏసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల ముందు ఉన్న 12 డిమాండ్లను ప్రభుత్వం ముందుచితే ఒక్క డిమాండ్‌ను కూడా అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ విస్మరించిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించకపోతే వచ్చే అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చలో అసెంబ్లీకి పిలుపు నిచ్చి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లకు ప్రతి ఏడాది 12 వేల రూపాయలు, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 5 లక్షల ప్రమాద బీమాను 10 లక్షలకు పెంచాలని, 50 ఏళ్ళు నిండిన డ్రైవర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు ఎంఎ సలీం, ప్రవీణ్, ఎస్.దయానంద్, రామ్‌రెడ్డి, రామ్‌కిషన్, ఎ.సత్తిరెడ్డి, యాదగిరి, అశోక్, కృష్ణ, ఎం.నరసింహా పాల్గొన్నారు.

## పాతబస్తీలో ట్రావెల్ ఏజెంట్ దారుణ హత్య

**చార్మినార్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఓ ట్రావెల్ ఏజెంట్ దారుణహత్యకు గురైన సంఘటన రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రెయిన్‌బజర్ ఇన్‌స్పెక్టర్ నేతాజీ కథనం ప్రకారం... రెయిన్‌బజార్‌కు చెందిన జూనైద్ జాఫ్రీ ట్రావెల్ ఏజెంట్. కాగా జూనైద్ జాబ్రీకి (35) అదే బస్తీకి చెందిన దగ్గర బంధువులతో గత కొంత కాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి.. జాఫర్ పహిల్వాన్ కుటుంబ సభ్యులు తమతో వైరం మానుకోవాలని పలు మార్లు జునైద్ జాబ్రీని హెచ్చరించారు. ట్రావెల్ ఏజెంట్ జునైద్ జాబ్రీ బుధవారం రాత్రి పదకొండు గంటల సమయంలో పాతబస్తీ రెయిన్‌బజార్‌లోని ఛోటాపూల్ వద్దకు వచ్చాడు. అదే సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు వ్యక్తులు జునైద్ జాబ్రీపై కత్తులతో పొడిచి పారిపోయారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన జునైద్ జాబ్రీ మృతి చెందాడు. మృతి చెందిన ట్రావెల్ ఏజెంట్ జునైద్ జాబ్రీకి భార్య, నలుగురు కుమార్తెలు కలరు. ఈ కేసుకు సంబంధించి రెయిన్ బజార్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రెయిన్ బజార్ పోలీసులు కేసును అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## నగర పర్యటనలో ఫ్రాన్స్ మెట్రోపోల్ బృందం

**-హైదరాబాద్ వారసత్వ కట్టడాలు పరిశీలన**
**న-సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై ఆరా**



**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ఫ్రాన్స్‌కు చెందిన బోర్డో మెట్రోపోల్ ప్రతినిధి బృందం గురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసింది. ఆర్కిటెక్చర్ అర్బన్ హెరిటేజ్ హెడ్ అన్‌లోర్ మోనియట్, ఫ్రాన్స్ డిప్యూటీ కాన్సల్ పాస్కల్ లోరో, బోర్డో మెట్రోపోల్ హైదరాబాద్ ఫోకల్ పాయింట్ హ్యూగో కువెట్ లతో కూడిన ఈ బృందం, హైదరాబాద్ నగర వారసత్వం, ప్రపంచ వారసత్వ నగరంగా ఎదిగే అవకాశాలపై మేయర్‌తో సుదీర్ఘంగా చర్చించింది. ఆతర్వాత జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులతో ఇతర అధికారులతో సమావేశమై, హైదరాబాద్ పాతనగరంలో జరుగుతున్న వారసత్వ సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి పనులపై సమగ్ర వివరాలు తెలుసుకుంది. నగరంలో వారసత్వ సంరక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ వివరాలు బృందానికి కమిషనర్ తెలిపారు. పర్యటనలో భాగంగా బృంద సభ్యులు నగరంలోని ఓల్డ్ సిటీలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, పాతఎంసిహెచ్ ఆఫీస్, సర్దార్ మహల్, ఖుర్షీద్ జా దేవడిలను పరిశీలించడంతో పాటు, చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం వంటి వారసత్వ కట్టడాలను సందర్శించారు. అంతకుముందు బృందం కుతుబ్ షాహీ టూంబ్స్‌ను సందర్శించి జరుగుతున్న సంరక్షణ, ల్యాండ్‌స్కేప్ అభివృద్ధి పనులను పరిశీలించింది. రాబోయే రోజుల్లో బోర్డో బృందం హైదరాబాద్‌లో ప్రతిపాదిత వారసత్వ ప్రాజెక్టులను సందర్శించనుంది. పారిస్ – హైదరాబాద్ నగరాల మధ్య సహకార కార్యక్రమాలకు పునాది వేసే సమగ్ర ప్రతిపాదనను బోర్డో మెట్రోపోల్ సిద్ధం చేయనుంది.

## హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలి : బిఆర్ఎస్



చందూలాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించిన మాజీ మంత్రి మహమూద్ అలీ,

**చార్మినార్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** హిల్ట్ పాలసీని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. హిల్ట్ పాలసీకి వ్యతిరేకంగా బిఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మాజీ మంత్రి మహమూద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు పాతబస్తీలోని చందూలాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవాలను తెలుసుకున్నారు. ఈ సందర్బంగామాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌లు మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులకు పరిశ్రమల భూములను ధారాదత్తం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీని తీసుకు వచ్చిందని వెంటనే హిల్ట్ పాలసీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హిల్ట్ పాలసీకి వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకులు ప్ల కార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు చందూలాల్ బారాదరి పారిశ్రామిక అసోసియేషన్ ప్రతినిధులు, వ్యాపారులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మహ్మాద్ సలీం, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్, బిఆర్ఎస్ నాయకులు ఆజంఅలీ, అతిధి రెడ్డి, సామసుందర్ రెడ్డి, సాయి కిరణ్, మహ్మాద్ ఇలియాస్ ఖురేషీ, గోపీగౌడ్, రవీశ్వర్, అనిల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కుక్కకాటు గురైన చిన్నారిని పరామర్శించిన మేయర్, డిప్యూటీ మేయర్



నిలోఫర్‌లో చిన్నారి ప్రేమ్‌చంద్‌ను పరామర్శిస్తున్న మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత

**హైదరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** కుక్కకాటుకు గురైన చిన్నారి ప్రేమ్ చంద్‌కు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, సీఎంఓహెచ్ పద్మజ, వెటర్నరీ అధికారులతో కలిసి నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత లు సూపరింటెండెంట్‌తో మాట్లాడి చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలను ప్రత్యేకంగా అందించాలని సూచించారు. ట్రీట్మెంట్ కు బాబు బాగా రెస్పాండ్ అవుతున్నారనీ మేయర్, డిప్యూటీకు వైద్యులు తెలిపారు. కాంప్రమైజ్ కాకుండ మెరుగైన వైద్య సేవలు అందించాలని మేయర్ ఆసుపత్రి ఆర్ఎంవో సూపరిండెంట్ లకు సూచించారు. వైద్యులు చెప్పినట్టు వినండి.. చికిత్స పూర్తయ్యే వరకూ వైద్యులు చెప్పినట్టు ఆసుపత్రిలో ఉంటూ బాబుకు వైద్యం అందించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బాలుడి తల్లిదండ్రులకు సూచించారు. సిఎం బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తున్నారన్నారని బాలుడికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మేయర్ తెలిపారు.

**వీధి కుక్కల దాడి ఘటన పై మానవ హక్కుల కమిషన్ స్పందన**

**నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్‌కు ఆదేశాలు**

నగర శివారు మన్సురాబాద్ డివిజన్ పరిధి శివ గంగ కాలనీలో మూగ బాలుడు ప్రేమ్ చంద్ పై వీధి కుక్కలు దాడిచేసిన సంఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమీషన్ స్పందించింది. పలు దిన పత్రికలలో వచ్చిన కథనాలను సుమోటోగా తీసు కున్న కమీషన్ ఈ నెల 29 లోగా నివేదిక ఇవ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ ను ఆదేశించింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యలకు సంబంధించిన స్థితిని నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల అమలు పరిస్థితి పై సమగ్ర నివేదిక ఇవ్వాలని కమిషన్ సూచించింది.

# ఫేక్ చలాన్ డిస్కౌంట్ వార్తలు

**-ఈనెల 13 రాయితీ ప్రచారం ఆసత్యం-అధికారిక నోటిఫికేషన్ లేదని పోలీసులు**



**హైదరాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త** మీ వాహనంపై ఎన్ని ట్రాఫిక్ చలాన్లు ఉన్నాయి? ఎక్కువ చలాన్లు ఉన్నాయని డిస్కౌంట్ వచ్చాక కడదామని చూస్తున్నారా? ఒక్కసారిగా సోషల్ మీడియా చూసి "చలాన్లపై భారీ డిస్కౌంట్ వచ్చిందట..100 రాయితీ కూడా ఇస్తార!" అని నమ్మితే పప్పులో కాలేసినట్లే. ట్రాఫిక్ చలాన్లపై భారీ తగ్గింపుల పేరుతో తిరుగుతున్న ఈ ప్రచారం మొత్తం ఫేక్ అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. వంద శాతం తగ్గింపు ఇస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై పోలీసులుతమ ట్విట్టర్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసి క్లారిటీ ఇచ్చారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేసేందుకు ఇది మంచి అవకాశం అనుకుంటున్న వాహనదారులు అసత్య సమాచారానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవలి రోజుల్లో ఇంటర్నెట్‌లో ఈనెల 13న చలాన్లపై పూర్తి రాయితీలు ఇస్తున్నారంటూ వేగంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆ తేదీన ఎలాంటి లోక్ అదాలత్ నిర్వహించడంలేదని, చలాన్లపై రాయితీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇప్పటివరకు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి తప్పుడు పోస్టులను నమ్మకుండా, మరెవరికి పంపకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇక తరచూ చలాన్లపై డిస్కౌంట్లు ప్రకటించడం సరికాదని, అలాంటి రాయితీలు వాహనదారుల్లో భయం తగ్గించి నిబంధనల ఉల్లంఘనలు పెరిగే అవకాశముందని హైకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీ లేదు. పెండింగ్ చలాన్ల గురించి నమ్మకమైన, అధికారిక సమాచారం కోసం మాత్రమే పోలీసుల వెబ్‌సైట్‌లు, యాప్‌లను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

## విహెచ్‌ను అభినందించిన కాంగ్రెస్ నేతలు



రోశయ్య స్మారక అవార్డు స్వీకరించిన వి.హనుమంతరావును అభినందిస్తున్న పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, చిత్రంలో నారాయణస్వామి, జె.సత్తిబాబు,రామ్మోహన్ తదితరులు

**హైదరాబాద్ డిసెంబరు 4 ప్రభాతవార్త ;** రవీంద్రభారతిలో గురువారం పిసిసి మాజీ అధ్యక్షుడు,రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు ఘనసత్కారం అందుకున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక అవార్డును వి.హనుమంతరావు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఇదే వేదికపై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జె.సత్తిబాబు,రామ్మోహన్, వేణుగోపాల్ యాదవ్, తోట జగన్నాథం, కోటం అనిల్‌కుమార్, జమీర్ భాయ్, లక్ష్మణ్, జహంగీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేద మహిళలకు కుట్టు మిషన్లు



రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్,డిసెంబరు 4 ప్రభాతవార్త :** అర్హులైన పాతబస్తీలోని నిరు పేద మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లుతప్పకుండ అందజేస్తుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు.పాతబస్తీకిచెందిన బహదూర్‌పుర,చార్మినార్,యాకుత్‌పుర నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీల ఇంఛార్జిలు పులిపాటి రాజేష్‌కుమార్,ముజీబుల్లా షరీఫ్,కె.రవిరాజ్‌లు గురువారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిశారు.హైదరాబాద్ జిల్లాలో ఎంతో మంది నిరుపేద మహిళలు ఉన్నారని,అర్హులైన నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని వారు చైర్మన్‌ను కోరారు.ఈ సందర్భంగా మైనార్టీ ఫైనాన్స్ కమిషన్‌చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ త్వరలోనే అర్హులైన పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని తెలిపారు.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన కుట్టు మిషన్ల పంప్కం పేద మహిళలకు ఒక వరం లాంటిదని,ప్రజలు కాంగ్రెస్ ప్రభు త్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్ మహ్మద్ అలీ,నజీర్ ఖాన్,హమీద్ ఉద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### మీనాక్షి నటరాజన్ కలిసిన చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ నాయకులు



ఏఐసిసి తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్

**చార్మినార్,డిసెంబరు 4 ప్రభాతవార్త :** ఏఐసిసి తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్,ఏఐసిసి తెలంగాణ అదనపు ఇంఛార్జి విశ్వనాధన్ పెరుమాళ్లు,ఏఐసిసి తెలంగాణ కో ఇంఛార్జి కార్యదర్శి సచిన్ సావంత్‌లను చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి,కాంగ్రెస్ పార్టీ గురించి వారికి బోయ నరేష్ వివరించారు.

## క్రైస్తవుల సమగ్రాభివృద్ధికి అండగా నిలుస్తుంది
## -మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్



రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మోమమ్మద్ అజహారుద్దీన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్

**చిక్కడపల్లి డిసెంబర్ 4 ప్రభాతవార్త :** రాష్ట్రంలో క్రైస్తవుల సమగ్రాభివృద్ధికి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మోమమ్మద్ అజహారుద్దీన్ అన్నారు. గురువారం తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ ఆధ్వర్యంలో మంత్రి అజహారుద్దీన్ ను కలిసి రాష్ట్రం క్రిస్టియన్ మైనార్టీలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రస్తావించి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.ఆడమ్ రాజ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు రాయిడిన్ రోచ్ తదితరులు పాల్గొన్నారు. క్రిస్టియన్ మైనారిటీలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటె తనను నేరుగా సంప్రదించి పరిష్కరించుకోవచ్చున్నారు.

## అద్భుతంగా సాగిన గానగంధర్వారాధన




సిటీ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ అంజనీ కుమారి లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 4 ( ప్రభాతవార్త ) :** సంధ్యా సరాగాలు పల్లవి ఆధ్వర్యంలో గానగంధర్వ ఘంటసాల జయంతి సందర్భంగా గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయణ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో గానగంధర్వారాధన కార్యక్రమం నిర్వాహకురాలు భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిటీ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ అంజనీ కుమారి లను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమం నిర్వాహకులు , ప్రముఖ గాయకుడు జి.వి.రమణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘసేవకులు కె .కె.రాజా, విశ్రాంత ఆర్మీ అధికారి షా నక్వీ, బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ అధినేత, టి. రామోజీ, సి.మురళి, వ్యాపారవేత్త వి.మురళి, సుమేధ, మహాలక్ష్మి, వెంకట లక్ష్మి, ఎం. లక్ష్మి, కామేశ్వరి, వేణుగోపాల్, విప్లవ్, చంద్రశేఖర్, అలీ, కుమార్, రాంగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు అద్భుతంగా గానం చేశారు. బ్రహ్మశ్రీ వీణాపాణి ఆశీస్సులతో ఈ కార్యక్రమం జరిగింది.



మారేడ్‌పల్లి సుబ్రమణ్యా స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు ముప్పిడిగోపాల్, సంతోష్ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు



వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో దత్తాత్రేయ స్వామివారికి దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించిన దృశ్యం



దత్తాత్రేయ జయంతిన్ని పురస్కరించుకుని గురువారంచిన్నబజార్‌లోని సాయిబాబా మందిరంలో పురానాపూల్ డివిజన్ మజ్లిస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# గురుదత్త జయంతి వేడుకలు

**సుబ్రమణ్యా స్వామి దేవాలయంలో**

**అడ్డగుట్ట,డిసెంబర్ 4 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్యా స్వామి దేవాలయంలోని శ్రీసాయిబాబా ఆలయంలో గురువారం గురుదత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధాకర్,చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, సీనియర్ కాంగ్రెస్ నేతలు ముప్పిడి మధుకర్,చిర్రబోయిన సంతోష్ యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, ధర్మకర్తలు, పి.నర్సింగ్ రావ్,పరమేశ్, బిజెపి నేత పిట్ల నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆంజనేయ స్వామి దేవాలయంలో**

**చిక్కడపల్లి డిసెంబర్ 4 (ప్రభాతవార్త ) :** వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో దత్తాత్రేయ స్వామి వారికి దత్త జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజ కార్యక్రమంలో భాగంగా దత్తాత్రేయ స్వామి వారికీ ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వేంకటాద్రి పాల్గొన్నారు.

**శ్రీసాయిబాబా సమాజం శ్రీసాయి నిలయంలో**

**బేగంపేట డిశంబరు 4,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డు లోని శ్రీసాయిబాబా సమాజం శ్రీసాయి నిలయంలో గురువారం శ్రీదత్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.దత్త జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు సాయినాధుని సన్నిధిలో జరిగిన శ్రీదత్త జయంతి ఉత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఉదయం గం 5.15నిలకు కాకడా హారతి (మేలు కొలుపు ప్రార్థన),గం6లకు అభిషేకము,గం 6.30నిలకు దేవస్థానము అర్చన,గం 8నుంచి గం 11.30ల వరకు భక్తులపూజలు,గం 9.45నిలకు సామూహిక సాయివ్రతం,గం 12లకు అఖండహారతి,దూప్ హారతి,రాత్రి గం 7.45లకు పల్లకి సేవ,గం 7.45 నుంచి గం 9.45ల వరకు రామంతాపూర్ అడ్లా సుదర్శన్ పార్టీ ఆధ్వర్యంలో భజన గం 10లకు సేజి హారతి ఇచ్చారు.ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజలు చేసారు.భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేసారు.

## చలో వరంగల్ పేరిట ఒసిల సింహ గర్జన భారీ బహిరంగ సభ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెఎసి నాయకులు

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** తమ డిమాండ్ల సాధన కోసం చలో వరంగల్ పేరిట జనవరి 11వ తేదీన 'ఒసిల సింహ గర్జన' భారీ బహిరంగ సభను వరంగల్ నగరంలో నిర్వహిస్తున్నామని ఓసి జెఎసి తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి జెఎసి జాతీయ ఛైర్మన్ నల్ల సంజీవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, సలహాదారు నావల్ల సత్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు తాగిసెట్టి పశుపతి తదితరులు మాట్లాడారు. ఒసిలకు జాతీయ, రాష్ట్ర స్థాయిలలో కమిషన్‌లను ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్ల కాలపరిమితిని 5 సంవత్సరాలకు పెంచాలని, విద్యార్థులకు వద్యా, ఉద్యోగాలలో పోటీ పరీక్షలకు వయో పరిమితిని పెంచాలని, ఒసిలకు ఈడబ్ల్యూఎస్ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేట్లు జారీకి ఆదాయ పరిమితిని 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ రాత పరీక్షకు 90 శాతం మార్కుల నుంచి 70 శాతంకు తగ్గించాలని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఈడబ్ల్యూఎస్ వారికి వర్తింపజేయాలని కోరారు. పై డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోతే రాష్ట్రాన్ని దిగ్బంధం చేస్తామని వారు హెచ్చరించారు.

## దివ్యాంగులకు ఏడు వరాలు ప్రకటించాలి : వల్లభనేని ప్రసాద్



మాట్లాడుతున్న డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్

**చిక్కడపల్లి డిసెంబర్ 4 ప్రభాతవార్త :** దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగులకు ఏడు వరాలు ప్రకటించడం శుభపరిణామం అని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కాటమోని వెంకటేష్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పటు ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే విధంగా దివ్యంగులకు ప్రకటించిన విధంగానే అక్కడ కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గురువారం చిక్కడపల్లి లోని సంస్థ కేంద్రం కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకటన చేయడం సంతోషంగా ఉందని, దివ్యంగుల పట్ల అక్కడి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో నిరూపించారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో ఇచ్చిన హామీ అయిన ఉచిత బస్ ప్రయాణం, రూ. 6000 పెన్షన్, బ్యాక్ లాగ్ ఉద్యోగాలు తదితరుల కల్పిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఎంతవరకు నెరవేర్చలేదన్నారు. డిసెంబర్ నెలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగానైనా అధికారికంగా తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగులకు కూడా 7 వరాలని ప్రకటించాలని కోరారు. లేకపోతే దివ్యాంగులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం కు వ్యతిరేకత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

## మానవ జీవన వైవిధ్యానికి ప్రతిరూపం శ్రీహరిచందనం కవితాసంపుటి : డా. కె.వి.రమణాచారి



శ్రీహరిచందనం కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న రమణాచారి, దేవదాసు, రఘుశ్రీ, రామచంద్రరావు, చెన్నప్ప తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 4 ప్రభాతవార్త :** మానవ జీవిన వైవిధ్యాన్ని తన రచనలో జెప్పించి పాఠకునికి చక్కని ఆలోచనల్ని రేకెత్తించేలా ప్రముఖ రచయిత నేతాజీ రచించిన శ్రీహరి చందనం కవితా సంపుటి అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ఎవర్‌గ్రీన్ యూత్ అసోసియేషన్, శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ సంపాదకుడు బైస దేవదాస్ సభాధ్యక్షతన రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరిగిన పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. మసన చెన్నప్ప, రెబ్బా రామారావు, దైవజ్ఞశర్మ, డా. ఇ.యాదగిరి సంస్థ ప్రధాన కార్యదర్శి రఘుశ్రీ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత నేతాజీ రచించిన శ్రీహరి చందనం కవితా సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. సాహితీ సృజన లక్షలమందికి స్ఫూర్తినిస్తుందని, రచయిత చెప్పదలచుకున్న విషయం సరళ సుందరం, సందేశాత్మకం, ఆలోచనాత్మకంగా ఉండేలా శ్రద్ధవహించాలని రమణాచారి సూచించారు. అధ్యక్షోపన్యాసంలో బైస దేవదాస్ నేతాజీ సంస్కారం కలిగిన సాహితీవేత్తని, సమాజానికి ఉపయుక్తమైన మంచి రచనలు చేస్తారని కొనియాడారు. సభను బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీలు సమన్వయపరిచారు. చివరిగా రచయిత నేతాజీ దంపతులను ఘనంగా సత్కరించారు.

## 7న సిఎంకు స్వాగతం, తమ సమస్యలపై దృష్టిని సారించాలని విజ్ఞప్తి



అభివాదం తెలుపుతున్న బోధన, బోధనేతర ఉద్యోగులు

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయంకు ఈ నెల 7వ తేదీన వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతూ తమ సమస్యలపై దృష్టిని సారించాలని విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర ఉద్యోగుల జెఎసి విజ్ఞప్తి చేసింది. తమ సమస్యలపై సిఎం సానుకూలంగా ఉన్నప్పటికి ఓయూ విసి, అధికారులు పట్టించుకోకుండా పెడచెవిన పెడుతున్నారని జెఎసి ఆరోపించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి ప్రతినిధులు ప్రొఫెసర్ మనోహార్, సురేందర్‌రెడ్డి, డా.పరుశురామ్, డా.ధర్మతేజ, డా.ఓర్సు కృష్ణయ్య మాట్లాడుతూ గత రెండు, రెండున్నర దశాబ్దాలుగా ఓయూలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పార్ట్‌టైం విభాగాల్లో బోధనా, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారని వీరికి కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ చేయాలని, కంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఓయూలో పనివత్తిడి అధికంగా ఉందని, వెంటనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, రెగ్యులర్ ఉద్యోగులకు మాదరిగానే తమకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వారు సిఎంను కోరారు. ఈ నెల 7న ఓయూకు వస్తున్న సిఎం తమ సమస్యలు తెలుపుకునేందుకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సిఎం రాకను పురస్కరించుకుని స్వాగతం పలికేందుకు ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్సీసిసి గేటు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. **సిఎంకు స్వాగతం పలుకుతూ బాధ నివేదన సభ:** పార్ట్ టైం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇదిలా ఉండగా 7వ తేదీన ఓయూకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లును కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తామని పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొపెసర్ల తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో డా.సూరేపల్లి వెంకటరత్నం, డా.పండరిరెడ్డి, ఉన్నత విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వే శ్వరరావు మాట్లాడుతూ అతి తక్కువ పనిచేస్తున్న పార్ట్ టైం, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అర్హతులు ఉన్నప్పటికి గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే ఈ విధానం కొనసాగుతున్నదని, ఈ ప్రభుత్వం పరిష్కారించే దిశలో ఉన్నందున న్యాయం చేయాలని వారు సిఎంను కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బాబూ రాజేంద్రప్రసాద్ సేవలు ఎనలేనివి



డా. బాబూరాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న మధుసూదనాచారి, గోపినాథరెడ్డి, మహ్మద్‌రఫీ, దైవజ్ఞశర్మ, హరినారాయణరెడ్డి తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 4 ప్రభాతవార్త :** భారతదేశ ప్రథమ రాష్ట్రపతి భారతరత్న డా. బాబూ రాజేంద్రప్రసాద్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివి, తరతరాలు మరువరానివని తెలంగాణ రాష్ట్ర శాసనసభ తొలిసభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో డా. కొండూరి హరినారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సంస్థ 4వ వార్షికోత్సవం, డా. బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి విశిష్ట అతిథులు డా. సిఎస్.గోపినాథ్‌రెడ్డి, రేలంగి నరసింహారావు, దైవజ్ఞశర్మ, సీనియర్ సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ, మార్గం రాజేష్, లయన్ నిర్మలాప్రభాకర్, నిర్వాహకులు డా. కొండూరి హరినారాయణరెడ్డి, కె.మురళా మోహన్‌రాజు, కుసుమ భోగరాజు, తులసీరామ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి అనంతరం స్వాతంత్ర్య సమర యోధుడు బండ పుల్లారెడ్డి, కె.విజయప్రసాద్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, కె.రమేష్‌బాబు, డా, రాధాకుసుమ, డా. వై.వి.సుబ్బారావులను ఘనంగా సత్కరించి బాబు రాజేంద్రప్రసాద్ స్మారక పురస్కారాలను ప్రధానం చేసి శుభాభినందనలు తెలిపారు.

## గుండెపోటుతో వాచ్‌మెన్ మృతి

**మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 4 ప్రభాతవార్త :** గుండెపోటుతో ఓ వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహ్మద్ మక్సూద్ కథనం ప్రకారం.....బిహార్‌కు చెందిన శివధన్ సింగ్ (61) బతుకు దెరువు కోసం మైలార్‌దేవ్‌పల్లికి వచ్చాడు.కాటేదాన్ వెంక టేశ్వరకాలనీలోని సత్య దుర్గా పేపర్ కంపెనీలో రాత్రి వేళల్లో వాచ్‌మెన్‌గా ఉంటున్నాడు.కాగా బుధవారంరాత్రి కంపెనీకి డ్యూటికి వెళ్లిన శివధన్ సింగ్ రాత్రి రెండు గంటల సమయంలో కంపెనీ ఆవరణలో నిద్ర పోయాడు.గురువా రం ఉదయం శివధన్ సింగ్ నిద్ర నుంచి లేవకపోవటంతో అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివధన్ సింగ్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీక రించారు.గుండె పోటుతో వాచ్‌మెన్ చని పోయినట్లు పోలీ సులు తెలిపారు.శివధన్ సింగ్‌కు భార్య,పిల్లలు కలరు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మృతి చెందిన సెక్యూరిటీ కుటుంబానికి రూ.3లక్షల సాయం**

కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో సత్య దుర్గా కంపెనీ లో సెక్యూరిటీ గార్డుగా శివధాని యాదవ్ (58) మృతి చెందిన విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కంపెనీ దగ్గరికి వెళ్లి మరణించిన కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని కంపెని యాజమానితో మాట్లాడి రూ.3లక్షల20 డిడి ద్వారా ఇప్పించారు. సెక్యూరిటీ ఏజెన్సీ అయినా సొంత గ్రామానికి డెడ్ బాడీని తీసుకుపోయే ఖర్చుంత భరించాలని చెప్పారు.

## దేశంలో అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్

**-మున్సిపాలిటీల విలీనంతో మాబాధ్యత మరింత పెరిగింది**

**- మేయరన గద్వాల్ విజయలక్ష్మీ**



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 4,ప్రభాతవార్త:** 20 మునిసిపాలిటీలను, 7 కార్పొరేషన్ లు ను కలిపి ఒకే మహా హైదరాబాద్‌గా మార్చాలనే గొప్ప కల ఇప్పుడు సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డినేతృత్వంలోని ప్రభుత్వ చారిత్రక నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విలీనంతో మాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈమేరకు గురువారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి మహాత్మాగాంధీ, డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహాలను వారు ఆవిష్కరించారు. అనంతరం మేయర్ గేట్ ప్రాంగాణంలో పౌంటేన్ సహా సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం , హెడ్ ఆఫీస్ కు కార్పొరేట్ లుక్ వచ్చేలా సుందరీకరణ పనులు ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకుల సహకారం వల్లే సాధ్యమైందన్నారు. అనంతరం మేయర్ జీహెచ్ఎంసీ లో పురపాలికల విలీనం పై స్పందించారు.27 పురపాలికల విలీన నిర్ణయంతో650 చదరపు కిలో మీటర్ల నుంచి 2000 చదరపు కిలో మీటర్ల విస్తరించిందన్నారు.ఫలితంగా హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద మెట్రోపాలిటన్ నగరంగా అవతరించిందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న జీహెచ్ఎంసీలో మున్సి పాలిటీలు భాగం కావడం వల్ల ఇక పై హైదరాబాద్ తో సమానంగా విలీన పురపాలికల అభివృద్ధి చెందుతాయనీప్రజలకు వేగంగా, సులభంగా సేవలు పొందగలుగుతారని అన్నారు. దేశంలోనే అతిపెద్ద మహా నగరం హైదరాబాద్ కు మేయర్, డిప్యూటీ మేయర్ లుగా ఉండడం మాకు గర్వ కారణం. సంతోషంగా ఉందని తెలిపారు.

# హిల్ట్‌పాలసి తెచ్చి పేదలతో ఆటలాడొద్దు

**-కాటేదాన్ పారిశ్రామిక వాడలో పర్యటించిన బిఆర్ఎస్ ముఖ్యనేతలు**
**-పరిశ్రమలు తరలిస్తే ఆ స్థలంలో డబుల్ బెడ్‌రూంలు నిర్మించాలి**
**-హిల్ట్ పాలసి వెంటనే రద్దు చేయాలి : సబితారెడ్డి**



**అత్తాపూర్ డిసెంబర్ 4,ప్రభాతవార్త :** సిఎం రేవంత్ రెడ్డి హిల్ట్ పాలసి తీసుకువచ్చి పేదకార్మికుల జీవితాలతో ఆటలు అడుతుందని సిఎం ఎన్ని కుట్రలు చేసిన హిల్ట్ పాలసిపై పోరాట చేస్తామని మాజీ మంత్రి ,ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు.హిల్ట్ పాలసిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు చేపట్టిన పారిశ్రామిక వాడల సందర్శనలో భాగంగా గురువారం మైలార్‌దేవ్‌పల్లి బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ,మాజీ కౌన్సిలర్ వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాటేదాన్ పారిశ్రామికవాడలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి,నియోజకవర్గ ఇంచార్జీ కార్తీక్ రెడ్డి, స్వామిగౌడ్,కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పర్యటించారు.కార్మికులతో ముచ్చటిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన హిల్ట్ చట్టాన్ని వివరించారు. అనం తరం సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ....హిల్ట్ చట్టంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని పారిశ్రామిక భూములను ప్రవైటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని రిజిస్ట్రేషన్ ఫీజును 30 శాతం చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తామనడం దుర్మార్గమైన చర్య పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఉన్న 22 పారిశ్రామికవాడలలో ఉన్న సుమారు 9000 ఎకరాల భూముల మార్పుకు తెచ్చిన 27 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఒక్కవేల హిల్ట్ పాలసి కొనసాగించి పారిశ్రామలు తరలిస్తే ఆ భూముల్లో పేదలకు డబుల్ బెడ్ రూంలు నిర్మించాలన్నారు.హైడ్రా పేరిట పేదల గుడిసెలు తొలగిస్తున్నారని ఇప్పుడు హిల్ట్ పాలసి తీసుకువచ్చి పేద కార్మికుల పొటకొట్టేందుకు కుట్ర చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను బిఆర్ఎస్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటుందని పేదల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ధర్మా రెడ్డి బిఆర్ఎస్ నేతలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

### బిసిల సంక్షేమం, అభివృద్ధి కోసం రాజీలేని పోరాటాలు



రాజేందర్‌కు నియామకపత్రాన్ని అందజేసు_న్న డాక్టర్ ర్యాగ అరుణ్‌బాబు

**సైఫాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌గా చెరుకుల రాజేందర్ నియమితులైనారు. ఈ మేరకు గురువారం బిసి భవన్‌లో రాజ్యసభ సభ్యుడు, సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ర్యాగ అరుణ్‌బాబు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. గత 25 సంవత్సరాలకు పైగా బిసి సంఘంలో కొనసాగుతూ ఆనేక ఉద్యమాలలో పాల్గొన్న రాజేందర్‌ను కన్వీనర్‌గా నియమించడం జగిందని, అరుణ్‌బాబు చెప్పారు. రాజేందర్ మాట్లాడుతూ బిసిల అభివృద్ధి, సంక్షేమ కోసం రాజీలేని పోరాటాలను కొనసాగిస్తానని చెప్పారు. తనకు పదవిని ఇచ్చిన ఆర్.కృష్ణయ్య, అరుణ్‌బాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి కెటిఆర్ నివాళులు



వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న కేటీఆర్

**సికింద్రాబాద్, నవంబర్ 4 ప్రభాతవార్తః** గాంధీ హాస్పిటల్ లో సీనియర్ వీడియో జర్నలిస్ట్ దామోదర్ మృతదేహానికి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, క్రిశాంక్, తదితరులు ఉన్నారుదామోదర్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాంటి విషాద సమయంలో బిఆర్ఎస్ పార్టీ తరఫున వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు.

## రూ. 40 లక్షలు ఇవ్వాలంటూ నకిలీ రిపోర్టర్ల బెదిరింపులు

**- పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 4, ప్రభాతవార్తః** ఒక ఇన్‌ఫ్రా సంస్థ నిర్వాహకులను రూ. 40 లక్షలు డిమాండ్ చేసిన ఇద్దరు నకిలీ రిపోర్టర్లపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కాలనీకి చెందిన సివాపురం సురేంద్ర కుమార్ ఎస్ఎస్ఎల్ ఇన్‌ఫ్రా సంస్థ నిర్వహిస్తున్నారు. ఆయన తుమ్మలేపల్లి గ్రామంలో 'పీకాక్ అవెన్యూ' పేరుతో దాదాపు వంద ఎకరాల ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. కొంత భూవివాదం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అభివృద్ధి కొంత మందగించింది. ఈ నేపథ్యంలోనే కొందరు కొనుగోలుదారులు అసంతృప్తితో ఉన్నారు. ఇది అదనుగా తీసుకున్న ఎస్‌కెవెస్ ఫ్లై టీవీ రిపోర్టర్‌గా పరిచయం చేసుకున్న మహేందర్ అనే వ్యక్తి ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించారు. తప్పుడు వీడియోలు ప్రసారం చేయడమే కాకుండా తప్పుడు న్యూస్ రిపోర్టులు ప్రచారం చేస్తానని బెదిరింపులకు దిగాడు. వీడియోలను నిలిపాలంటే తనకు రూ. 40 లక్షలు చెల్లించాలంటూ డిమాండ్ చేశాడు. లక్ష రూపాయలు ఇస్తామని కోరగా అందుకు తిరస్కరించిన మహేందర్ మరింత ఒత్తిడిని కొనసాగించాడు. అతనితో పాటు వెంకటేష్ అనే మరో వ్యక్తి సైతం రిపోర్టర్‌గా చెప్పి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఇద్దరిపై సురేంద్రకుమార్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన ఆడియో-వీడియో రికార్డులను పోలీసులకు అందించారు. దీంతో పోలీసులు మహేందర్, వెంకటేష్‌లపై సెక్షన్ 308(3), 353(1)(సి) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హీరా గ్రూపు సీఈఓ పై కేసు నమోదు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 4, ప్రభాతవార్తః** హీరా గ్రూపు సీఈవో హీరా షేక్‌పై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సన్ సిటీ రోడ్ నంబరు 10లో నివసించే మహమ్మద్ సల్మా ఫాతిమా తన కుటుంబ సభ్యుల ద్వారా 2016లో యూనిట్ పథకం కొనుగోలు కింద దాదాపు రూ. 40 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఇందుకు సంబంధించి నెలవారి, వార్షిక లాభాలు లేదా అసలు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని హామినిచ్చారు. 2018 నుంచి ఎలాంటి లాభాలు చెల్లించకపోవడం, హీరా షేక్ నేతృత్వంలోని కంపెనీ సరిగ్గా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గమనించారు. దీంతో ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు హీరా షేక్‌పై 316(2), 318(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామిపూజ



దేవాలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు, వ్యాపారస్తులు తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో శ్రీ శ్రీ శ్రీ గరుడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ అధ్యక్షులు గంగా బాలాజీ, ప్రధాన కార్యదర్శి తల్లం శ్రీకాంత్, కాపర్తి విశ్వనాథ్ లు మాట్లాడుతూ తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షులు చేగురి వెంకటరమణ, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదారం కృష్ణ, దుగ్గు జగదీష్ ,మలక్‌పేట్ శ్రీ కృపా మార్కెట్ దిగుమతి–ఎగుమతి వ్యాపారస్తుల అపారమైన సహాయ, సహకారాలతో ప్రతి నెల పౌర్ణమి రోజుశ్రీ రమసహిత సత్యనారాయణ స్వామి వ్రతపూజ, అన్నప్రసాద కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తూన్నమని వివరించారు. సేవా కార్యక్రమాలు నిలకడగా కొనసాగడానికి సహకారం అందిస్తుమ్మొత్తం కమిటీ సభ్యులకు, వ్యాపారస్తులందరికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కావున భక్తులందరూ అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు

## రోశయ్యకు ఘన నివాళి



రోశయ్యకు నివాళులర్పిస్తున్న కమిషనర్, సిబ్బంది

**హయత్ నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొనిజేటి రోశయ్య వర్ధంతిని పురస్కరించుకొని పెద్ద అంబర్ పేట సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.రవీందర్ రెడ్డి రోశయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ... రోశయ్య ఆర్థిక మంత్రిగా రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా వ్యవహ రించారని గుర్తుచేశారు. కార్య క్రమంలో కార్యాలయ అధికారు లు, సిబ్బంది పాల్గొన్నారు

## ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ సూపర్ వైజర్స్, స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడిగా రాజు



బుగుడాల రాజును సన్మానిస్తున్న చౌకీ రవికుమార్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 4, ప్రభాతవార్త:** చంచల్ గూడా ప్రభుత్వ సెంట్రల్ ప్రింటింగ్ ప్రెస్ సూపర్వైజర్స్, స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడిగా బుగుడాల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుగుడాల రాజు మాట్లాడుతూ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులు, సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి తోడ్పడుతామని పేర్కొన్నారు. అదేవిధంగా యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్ సూపర్వైజర్స్, స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బుగుడాల రాజును మలక్ పేటలో జరిగిన కార్యక్రమంలో ఓల్డ్ మలక్ పేట్ శ్రీ పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముంతాజ్ ఆలీ, శ్రీనివాస్ గౌడ్, గ్రేటర్ బిజెపి కార్యదర్శి చౌకిరాజు, నాయకులు శ్రీకాంత్ గౌడ్, కమల్ కిషోర్, బిక్షపతి, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

## విజయ వినాయక దేవస్థానంలో మైనంపల్లి పూజలు



**మల్కాజిగిరి డిసెంబర్ 4 ప్రభాతవార్త ;** దత్తాత్రేయ జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధి లోని వాణి నగర్ విజయ వినాయక దేవస్థానంలో మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు చైర్మెన్ సిరిగిరి రాజు, పివి సత్యనారాయణ,బలరాం, వీరభద్రరావు, జన్నయ్య,లక్ష్మి, ఈవో వెంకన్న,ఆలయ పండితులు వేణుగోపాల్ శర్మ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ బి కే శ్రీనివాస్ గుండా నిరంజన్ పిట్టల శ్రీనివాస్ జి ఎన్ వి సతీష్ కుమార్ డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ సంపత్ గౌడ్ వినోద్ యాదవ్ సయ్యద్ మబ్బు, సంతోష్ రాందాస్ ముదిరాజ్, బాబు సత్యనారాయణ ఆశా ప్రభ ఇందిరా ప్రియదర్శిని బాలరాజు యాదవ్ ఆగమయ్య, సురేష్ సింగ్ ఇస్త్రారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మినగర్ షిర్డీ సాయి మందిరంలో దత్తాత్రేయ జయంతి



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం 58 కళశములతో దత్తాత్రేయ స్వరూప సాయినాధుడికి క్షీరాభిషేకం గావించారు. అనంతరం అనఘాష్టమి దేవి వ్రతాన్ని, సాయంత్రం బాబా వారి రథోత్సవాన్ని భక్తజన సందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రతినిధులు నేరెళ్ల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్జాదిగూడలో ఘనంగా దత్తజయంతి వేడుకలు



పీర్జాదిగూడ శ్రీ దత్త క్షేత్రంలో దత్త జయంతి వేడుకలలో మాజీ మేయర్ అమర్ సింగ్ , మాజీ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి , చిలుమల జగదీశ్వర్ రెడ్డి , వేణు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు

**మేడిపల్లి, డిసెంబర్ 4 ప్రభాతవార్త ;** దత్త జయంతిని పురస్కరించుకుని పీర్జాదిగూడ శంకర్ నగర్ దేవాలయంలో శ్రీ దత్తాత్రేయ స్వామికి సుప్రభాత సేవ ,అభిషేకము ,పూర్ణ హారతి ,పుష్పార్చన, మంత్ర పుష్పములు , అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. దత్తాత్రేయ కథనాలు, విశేషాలను ప్రచురిస్తారు. దత్త జయంతి హోమం అనేది దత్తాత్రేయ స్వామికి నిర్వహించే ఒక ప్రత్యేక హోమం. దత్తాత్రేయ స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా చేశారు .మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ...శ్రీ దత్త జయంతి అనేది భక్తిని ధర్మాన్ని సేవా భావాన్ని మన హృదయాల్లో నింపే పవిత్ర పర్వదినం ఫిర్జాదిగూడ ప్రజలందరిపై శ్రీ దత్తాత్రేయ స్వామి వారి దివ్య కృప ఉండాలని అన్నారు . ఈ జగత్తుకు ఆది గురువు శ్రీ దత్తాత్రేయుడు మాత్రమే ఎన్నో యుగాలు నుండి గురు పరంపరను ముందుకు నడుపుతున్నది కూడా ఈ దత్తాత్రేయ గురువును ప్రసన్నం చేసుకొని మానవులు తన బాధలను తొలగించుకొనుటకు ఉప యుక్తులు కావాలి . మనం ఈ బాధల నుండి రక్షించుటకై శ్రీ దత్తాత్రేయ క్షేత్రంలోని దత్తాత్రేయ కొలువై ఉన్నారు . ఈ దేవాలయంలో ప్రతి గురువారము, పౌర్ణమి అమావాస్య , పర్వదినాల్లో దత్త అభిషేకములు , దత్తమాల మంత్రము , వజ్ర కవచము శోకరూప గురు చరిత్ర హోమము నిర్వహిస్తారు . ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్ , మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి , మాజీ కార్పొరేటర్ రాజేశ్వరి అంజిరెడ్డి ,మాజీ కో ఆప్షన్ సభ్యులు చిలుమల జగదీశ్వర్ రెడ్డి , ఫిర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ , యాసారం మహేష్ , వేణు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

## విద్యార్థుల్లో ఆప్టిట్యూడ్ నైపుణ్యాల పెంపు అవసరం

**-మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్లపై అవగాహన : డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వర్లు**



**నేరెడ్ మెట్, డిసెంబర్ 4,ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఫర్ ప్లేస్మెంట్ డ్రైవ్" పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట నుంచి విచ్చేసిన డా. సి. హెచ్. వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులకు విస్తృత ఉపన్యాసం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లేస్మెంట్లలో మెరుగైన ఫలితాలు సాధించాలంటే గణితపరమైన అవగాహన, సమస్య పరిష్కరణా నైపుణ్యాలు, త్వరిత నిర్ణయ సామర్థం కీలకం అని తెలిపారు. ప్రముఖ కంపెనీలు నియామక ప్రక్రియలో అడిగే ప్రశ్నల నమూనాలు, వాటిని తక్కువ సమయంలో ఎలా పరిష్కరించాలో విద్యార్థులకు ప్రాయోగికంగా శిక్షణ అందించారు. ఆప్టిట్యూడ్ పరీక్షల్లో సమయం నిర్వహణ, లాజికల్ థింకింగ్, మెంరీ టెక్నిక్స్ వంటి అంశాలు ప్లేస్మెంట్లలో ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మాట్లాడుతూ,"ప్రస్తుత పోటీ వాతావరణంలో ప్రతి విద్యార్థి ఆప్టిట్యూడ్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యవసరం. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తు వైపు దోహదం చేస్తాయి. కళాశాల ప్లేస్మెంట్ సెల్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉంది" అని అన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని డబ్బు లేకుండా, తమ నైపుణ్యాలతో అవకాశాలను సాధించడానికి దోహదం చేసే శిక్షణగా అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రాజేశ్ కుమార్, కామర్స్ విభాగ అధ్యాపకురాలు శ్రీమతి మల్లిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహాపడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న సబితాఇంద్రారెడ్డి, పటేల్ సునీతరెడ్డి

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** హరిహరసుత అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం అయ్యప్ప స్వామి భక్తుల శరణఘోష మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ హరిపురికాలనీలో బిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం మహేశ్వరం నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి ఆధ్వర్యంలో ఆమె నివాసంలో గురువారం అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం గిరి గురుస్వామి, మారి గురుస్వామి నేతృత్వంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామిని వేడుకొంటూ అయ్యప్పస్వామి భక్తులు భజనలు, గీతాలాపనలు చేయడంతో ఆ ప్రాంతం ఆధ్యాంతం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. పదునెట్టాంబడి పూజ అత్యంత అద్భుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మహా పడిపూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పటేల్ శ్రీనివాస్ రెడ్డి, నిఖిల్‌రెడ్డి, శివాని, టిఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, గొడుగు శీను, కొండ్రు శ్రీనివాస్, శ్యామ్‌గుప్తా, పెంబర్తి శ్రీనివాస్, సిద్ధగోని వెంకటేష్, మల్లేష్‌ముదిరాజ్, జయమ్మ, లలిత, విజయలక్ష్మి, నిర్మల, లత, నిమ్మల సునీతరెడ్డి, చామల శ్యామలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారం వ్యాపారంలో అధిక డబ్బులు ఎరచూపి మోసం

**-పలు విడతల్లో 13.50 లక్షలు వసూలు**

**-అడిగితే మహిళ బెదిరింపులు**

**హయత్ నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త :** తాను బంగారు వ్యాపారినని... వ్యాపారంలో డబ్బులు పెట్టుబడిగా పెడితే తిరిగి అధిక మొత్తం ఇస్తానంటూ వ్యక్తిని మోసగించిన మహిళపై హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.... నాగోల్ లలితా నగర్ కు చెందిన గన్నపు రెడ్డి కవితరెడ్డి బోటిక్ షాప్ నిర్వహిస్తోంది. తన భర్త రామకృష్ణరెడ్డి కోదాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ అని చెబుతూ... తాను బంగారం వ్యాపారం చేస్తుంటానని మధు అనే వ్యక్తి ద్వారా బొంగ్లూర్ ఎక్స్ రోడ్డులో నివసించే పిల్ల వినోద్ ను పరిచయం చేసుకుంది. చెన్నై నుండి బంగారం వస్తుందని డబ్బులు తక్కువ పడ్డాయని వినోద్ నుండి 1.10.2024న 3 లక్షల రూపాయలు తీసుకుంది. మరోసారి 2.70 లక్షలు తీసుకుంది. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని వినోద్ అడిగితే ఆంధ్రాలో బంగారం ఇరుక్కు పోయిందని తెలిపింది. మరిన్ని డబ్బులు కడితే మొత్తం వస్తుందని తన స్నేహితురాలు సుధారెడ్డి కి గ్రానైట్ క్రషర్ వ్యాపారం ఉందని... నీ డబ్బులకు తాను గ్యారంటీ అంటూ నమ్మబలికింది. ఈ క్రమంలో సూర్యాపేట సమీపంలో వ్యవసాయ భూమిని తమాదేనని చూపి మరో 8 లక్షల రూపాయలు తీసుకుంది. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని వినోద్ అడిగితే... ఇవ్వకపోగా నా భర్త ప్రస్తుతం మునగాల సీఐగా ఉన్నారని ఎల్బీనగర్ పీఎస్ లో నీమీద కేసు పెడతానని బెదిరించింది. బాధితుడు వినోద్ పిర్యాదు మేరకు పోలీసులు కవితారెడ్డి మీద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## జిహెచ్ఎంసిలో బడంగ్‌పేట్ జోన్‌ను ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర బిఎస్‌పి అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్**



మాట్లాడుతున్న రాష్ట్ర బిఎస్‌పి అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల విలీన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో బడంగ్‌పేట్ జోన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్రబిఎస్‌పి అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో విలీనం చేయడం సరికాదనీ అసంబద్ధ నిర్ణయం వల్ల బడంగ్‌పేట్‌లో అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసిలో విలీనం అయిన బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలను ప్రత్యేకంగా బడంగ్‌పేట్ జోన్‌లోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే జల్‌పల్లి మున్సిపాలిటీని కూడా కలపాలని ఆయన అన్నారు. బడంగ్‌పేట్ జోన్ కొరకు ఇక్కడి అన్ని పార్టీల నాయకులు ఐక్యమై పోరాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ జోన్ ఏర్పాటయ్యే వరకు బిఎస్‌పి తరపున పోరాడుతామని శేఖర్ స్పష్టం చేశారు.



తుర్కయంజల్ మున్సిపాలిటీనీ జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ లో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ చౌరస్తా సాగర్ హైవే పై సిపిఐ,సిపిఎం నాయకులు నిరసన

## త్వరలో రాంరెడ్డినగర్ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు : అరుణ్

**రామంతాపూర్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** రామంతాపూర్ రాంరెడ్డి నగర్ నుండి కోఠి, సికింద్రాబాద్ వరకు కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపించాలని ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసి డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. దీంతో గురువారం ఆర్టీసీ అధికారులు బస్సు తిరిగే ప్రాంతాల్లో సర్వే చేపట్టారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌తోపాటు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ పలువురు కాలనీ సంఘం నేతలు కాలనీలలో పర్యటించారు. ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తే స్థానికుల సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ రామ్ రెడ్డి నగర్, వాసవి నగర్, కామాక్షిపురం,వివేక్ నగర్ కాలనీ వాసులు బస్సు సర్వీసు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా 115, 18 బస్సు సర్వీసు నడిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులను కలిసినట్లు తెలిపారు. దీనిపై ఉప్పల్ డిపో శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ భారత్ జోడో యాత్రి బిఆర్ఎస్‌లో చేరిక

**సరూర్‌నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ షరీఫ్‌నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, భారత్ జోడో యాత్రి మహ్మద్ రియాజ్ ఆ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం పలువురు మైనారిటీ నాయకులతో కలిసి ఆయన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె రియాజ్‌కు గులాబి కండువా వేసి బిఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఖలీల్ పాష, మహ్మద్ అకిల్, మహ్మద్ నసీరుద్దీన్, మహ్మద్ ఫజల్, మహ్మద్ మహమూద్, ఖాసిం, ఆబేద్, నదీమ్, నవాజ్, అనీస్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వరదనీటి కాలువ నిర్మాణంతో సమస్యకు పరిష్కారం

**: కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి**



వరదనీటి కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లోని బాలాజి నగర్ నుండి బిఎస్ఎన్ఎల్‌కు చెందిన స్థలం వరకు రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఆర్‌సిసి స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ వరదనీటి కాలువ నిర్మాణంలో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. వరదనీటి కాలువ నిర్మాణం పూర్తయితే చాలా కాలనీలకు వరదముంపు సమస్య తొలగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రేణుక ముదిరాజ్, రమాదేవి, గిరిధర్‌రెడ్డి, కాలనీవాసులు యాదయ్య, మల్లేష్, అశోక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాములు, కెఆర్‌సి రెడ్డి, సర్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జడ్‌సికి వినతి



జడ్‌సికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ లోని ఏకలవ్యనగర్, మహిళా భవన్ ముందు, శంకేశ్వర్ బజార్ బస్తీ, గాంధీనగర్, వి.కె.ధాగె నగర్‌లలో సిసి రోడ్ల నిర్మాణానికి, భూలక్ష్మినగర్‌లో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి, డివిజన్‌లోని పలు కాలనీలలో నేటి అవసరాలకు తగ్గట్లుగా నూతన యుజిడి నిర్మాణానికి తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి చార్మినార్ జోనల్ కమీషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న పున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత పేర్కొన్నారు. అమీర్పేట గ్రామం ఎన్నికల ఇన్చార్జిగా నియామకం ఆయన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఏ.రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పున్న గణేష్‌నేత మాట్లాడుతూ మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్న గారి లక్ష్మారెడ్డి సలహాలు సూచనల మేరకు గ్రామంలో ప్రచార కార్యక్రమాన్ని విస్తృతం చేస్తున్నామన్నారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి, 12 మంది వార్డ్ మెంబర్లను అత్యధిక మెజార్టీతో గెలిచే విధంగా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ కలిసికట్టుగా పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యాదయ్య, యాదగిరిగౌడ్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ ఆవుల రఘుపతి, అశోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జెల్ల జగన్నాథం, దుర్గాప్రసాద్, గల్లా శ్రీకాంత్, అంజయ్య, భాస్కర్, మల్లేష్, వెంకటేశ్, కేజే ప్రసాద్, గల్ల యాదయ్య ఈశ్వరయ్య, శ్రీనివాస్, ప్రేమ్‌రాజ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.కోటి వ్యయంతో అజ్మత్‌నగర్ కల్వర్టు నిర్మాణం : బన్నాల గీత



అజ్మత్‌నగర్‌లో కల్వర్టు పనులు పరిశీలిస్తున కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అజ్మత్‌నగర్ కాలనీలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ అజ్మత్‌నగర్ కాలనీలో రూ.కోటి వ్యయంతో కల్వర్టు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అస్మత్ నగర్ నుండి నార్త్ కల్యాణపురి, మల్లికార్జున్ నగర్ మీదుగా చిల్కానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రజలకు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కల్వర్టు పనులు పూర్తయ్యేంతవరకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే పనులు త్వరతగతిన పూర్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాదిక,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్‌రెడ్డి, కొక్కండ జగన్, శ్యామ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రాదంజోడ్, ప్రొ. లాలయ్య, సునీల్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

### బిజెపి నాయకులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలి : కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసిన బిజెపి నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ గురువారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి మాటలను వక్రీకరిస్తూ బిజెపి నాయకులు, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం దుర్మార్గమని కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిషలు కష్టపడుతూ, రైజింగ్ తెలంగాణ నినాదంతో ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే బిజెపి నాయకులు కుటిల రాజకీయాలకు తెరతీస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, గంట్ల కృష్ణ, అశ్రఫ్ హుస్సేన్, మహ్మద్ మహబూబ్ ఖాన్, ఎం.కృష్ణ కుమార్, కోట్ల లడ్డు పటేల్, ఘని, అమీర్ అలీ, ఫజల్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో గ్రేటర్ ఈస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశం




గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆర్కిటెక్ సయ్యద్ అస్లాం బాషాను సత్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 4 ప్రభాతవార్త :** గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశం గురువారం ఉప్పల్‌లోని ఎస్వీవి గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి భారతదేశ అగ్రశేణి అర్కిటెక్ట్ సయ్యద్ అస్లాం భాసా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టి.నరసింహారావు, అధ్యక్షుడు మారం సతీష్‌కుమార్, కార్యదర్శి రవి, యువజన విభాగం నేతలు విక్రమ్‌కుమార్, సంతోష్‌రెడ్డి, అక్షయ్‌సాధు, మారం మేఘన, గౌరిశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు బిల్డర్లు ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రభుత్వ నిబంధనల కారణంగా బిల్డర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బిల్డర్లుకు సహకారం అందించాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ తక్కువ ధరలకే నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు బిల్డర్లు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులు పలు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ పరిధిలోని పలువురు బిల్డర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప మహాపడి పూజోత్సవం



మహా పడిపూజను నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోతి, డాక్టర్ వెంకటేశ్

**సరూర్‌నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్వి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, నర్సింగ్ స్కూల్ వీధిలో బుధవారం రాత్రి శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆసుపత్రి అధినేతలైన డాక్టర్ జ్యోతి, డాక్టర్ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో ఆద్యంతం పడి పూజ భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. 14వ సారి అయ్యప్ప మాల ధారణ చేసిన డాక్టర్ వెంకటేశ్ అయ్యప్ప స్వామి సేవలో 26వ సారి పడి పూజోత్సవాన్ని కుటుంబ సభ్యులతో కలిసి కనుల పండువగా నిర్వహించారు. నాదర్‌గుల్‌కు చెందిన మహా గురుస్వామి, అయ్యప్ప భజనల గాయకుడు పాలుబాయి అశోక్ బృందం ఆలపించిన భక్తి భజన పాటలతో ఆర్‌సిఐ రోడ్డు, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ మార్మోగింది. పూజలో భాగంగా డాక్టర్ జ్యోతి దంపతులు అయ్యప్ప స్వామికి వివిధ రకాల అభిషేకాలను చేసి కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్ప పడి వెలిగించారు. మహా హారతి అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూజకు హాజరైన భక్తులకు పంచామృతాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్, నాదర్‌గుల్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన సన్నిధానం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్‌ను ఎల్‌బినగర్ జోన్‌లో కలపాలి: బిజెపి



జిహెచ్ఎంసి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించిన బడంగ్‌పేట్ బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి విస్తరణలో భాగంగా విలీనం చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో కలపడం బిజెపి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు కార్పొరేషన్ క్లస్టర్ల బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డిలు గురువారం జిహెచ్ఎంసి కమీషనర్ కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు చార్మినార్ జోన్‌లో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను విలీనం చేయడాన్ని తమ పార్టీతో పాటు ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను దగ్గరలో ఉన్న ఎల్‌బినగర్ జోన్‌లో కలపాలని వారు విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట్ కేంద్రానికి దాదాపు 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న చార్మినార్ జోన్‌లో విలీనం చేయడం పూర్తిగా అశాస్త్రీయమనీ అయితే తమ ప్రాంతాలకు దగ్గరలో కేవలం 15 నిమిషాల్లోనే చేరుకోగలిగే సౌలభ్యం నుండి ఎల్‌బినగర్ జోన్‌లో కలిపితే సమంజసంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళీధర్, ప్రవీణ్‌గౌడ్, దేశపాక జగన్ పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి:ఉప్పల



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్‌లోని శ్రీషిరిడీసాయిబాబాసంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన దత్తాత్రేయ స్వామి జయంతి మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన దత్తస్వామి మూలవిరాట్‌కి అభిషేకం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా దేవాలయంలో దత్తనామ పారాయణము, హారతి, తదనంతరం మహా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీషిరిడిసాయి బాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ కొలన్ వెంకట్‌రెడ్డి, ప్రదానకార్యదర్శి కొర్వి జంగయ్యగుప్త,కోశాదికారి రావుల రంజిత్‌గౌడ్,వ్యవస్థాపక అధ్యక్షులు గునగంటి రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.